# ఔట్‌సోర్సింగ్ పేరిట మోసం

**కలెక్టరేట్ సాక్షిగా పెద్ద మొత్తంలో వసూళ్లు**

- ఉద్యోగాలిచ్చి.. పర్మినెంట్ చేస్తామని ఒక్కొక్కరి నుంచి రూ. 2 లక్షల నుంచి రూ. 3 లక్షల దాకా..
- వెట్టిచాకిరీ చేయించుకొని వేతనాలు చెల్లించని ఏజెన్సీ
- కలెక్టర్‌కు.. ఆపై ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన బాధితులు
- చివరకు పోలీస్‌స్టేషన్‌కు చేరిన పంచాయితీ
- ఎఫ్ఐఆర్ నమోదు.. ముగ్గురిపై కేసు
- జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసులో రిజిష్టరు కాని ఏజెన్సీ పేరు



మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయం

మంచిర్యాల, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ సాక్షిగా భారీ మోసం బయటపడింది. నూతనంగా నిర్మించిన నస్పూర్ కలెక్టర్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు (గార్డెనింగ్, క్లీనింగ్, సెక్యూరిటీ గార్డు) పోస్టులు ఇప్పిస్తామని అక్షర ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ భారీ మొత్తంలో వసూళ్లకు పాల్పడింది. ముందు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తాం, ఆ తర్వాత పర్మినెంట్ చేపిస్తామంటూ దాదాపు 40 మంది నుంచి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. డబ్బులు తీసుకొని తమతో కొన్ని నెలలుగా వెట్టిచాకిరీ చేయించారని, ఇప్పుడు జీతం అడిగితే ఇవ్వకపోగా చంపేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ పలువురు వాపోతున్నారు. లక్షల రూపాయాలు తీసుకొని, వేతనాలు ఇవ్వకుండా తమ బతుకులను ఆగం చేసిన ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

## అవసరానికి మించి రిక్రూట్..

కలెక్టరేట్‌లో గార్డెనింగ్, క్లీనింగ్, సెక్యూరిటీ గార్డు పోస్టులకు కాంట్రాక్ట్ తీసుకున్న అక్షర ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ.. అవసరానికి మించి రిక్రూట్ చేసుకుంది. దాదాపు రెట్టింపు సంఖ్యలో ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిసింది. ముగ్గురు సెక్యూరిటీ గార్డులు అవసరముంటే.. ఆరుగురు నుంచి ఏడుగురిని, గార్డెనింగ్ క్లీనింగ్ కోసం 10 మంది అవసరమైతే దాదాపు 25 మందిని చేర్చుకున్నారు. వీరంతా ప్రస్తుతం కలెక్టరేట్‌లో పని చేస్తున్నారు. కొన్ని నెలలుగా పని చేస్తున్నా.. ఎవరికీ వేతనాలు రాకపోవడంతో ఏజెన్సీ నిర్వాహకులను నిలదీసినట్లు తెలిసింది. ఈ విషయాన్ని బాధితులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిసింది. కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విషయం తెలుసుకున్న సదరు ఏజెన్సీ నిర్వాహకుడు వారిని కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ ముందే బెదిరించినట్లు చెప్తున్నారు. కలెక్టర్, జేసీ, ఏవో అందరూ నా దోస్తులే.. మీ దిక్కు ఉన్న చోట చెప్పుకోండి.. ఎక్కువ చేస్తే చంపేస్తానంటూ ఆయన వార్నింగ్ ఇచ్చినట్లు చెప్తున్నారు. దీంతో సోమవారం ప్రజావాణిలో సైతం కొందరు మహిళా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు దీనిపై నేరుగా ఫిర్యాదు చేశారు. కానీ ఎలాంటి స్పందన లేకపోవడంతో జాప్యం జరుగకూడదనే ఉద్దేశంతో గురువారం నస్పూర్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించారు. దాదాపు 12 మంది బాధితులు స్టేషన్‌కు రావడంతో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు ఏజెన్సీ ఎండీ గుర్రం శ్రీనివాస్, వినోద్, శ్రీనివాస్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు. విచారణ చేస్తున్నామని, కోర్టులో సబ్‌మిట్ చేస్తామని పోలీసు ఉన్నతాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయంపై సదరు ఏజెన్సీ ఎండీ శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. కావాలనే తనను టార్గెట్ చేసి కొందరు ఇదంతా చేస్తున్నారన్నారు. ఒక్క మంచిర్యాలలోనే ఇలా ఉంది.. ఇంకెక్కడా ఇలా లేదని చెప్పారు. కాగా.. అమాయకులను ఇంత మోసం చేసిన ఈ ఏజెన్సీ అసలు జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసులో రిజిస్టరై లేనట్లు తెలిసింది. త్వరలోనే అన్ని విషయాలపై స్పష్టత ఇస్తామని పోలీసులు తెలిపారు.



ప్రజావాణిలో చేసిన ఫిర్యాదును చూపిస్తున్న గార్డెనింగ్ ఉద్యోగులు

# యాసంగికి ఢోకా లేదిక..

**ప్రాజెక్టులు, చెరువుల్లో పుష్కలంగా జలం**

- 1,73,650 ఎకరాల్లో సాగుకు నీరు
- ఈ ఏడాది భారీ వర్షాలతో నిండుకుండలా జలాశయాలు
- కడెం ప్రాజెక్టు ద్వారా 65 వేల ఎకరాలకు..
- చెరువుల ద్వారా పూర్తిస్థాయి ఆయకట్టుకు అందించే అవకాశం



పూర్తి నీటిమట్టంతో నిండు కుండను తలపిస్తున్న కడెం ప్రాజెక్టు

నిర్మల్, డిసెంబర్ 15(నమస్తే తెలంగాణ): ఈ యాసంగి సీజన్‌లో ఆయా పంటల సాగుకు అవసరమైన నీరందించేలా జిల్లా నీటి పారుదల శాఖ సర్వం సిద్ధం చేసింది. జిల్లా రైతులు ఏటా యాసంగిలో ఆరుతడి పంటల సాగుకే మొగ్గు చూపుతారు. అయితే ఈ సారి భారీ వర్షాల కారణంగా జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువులు పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరి జలకళతో నిండుకుండను తలపిస్తున్నాయి. దీంతో అన్ని రకాల పంటలకు నీరందే అవకాశం ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన చెరువులను గత కేసీఆర్ ప్రభుత్వం బాగు చేయించింది. మిషన్ కాకతీయ పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా ఉన్న 734 చెరువులకు మరమ్మత్తులు చేసి పూర్వ వైభవం తీసుకొచ్చింది. గత నాలుగేళ్లుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులతో పాటు చెరువులన్నీ జలకళను సంతరించుకున్నాయి. దీంతో ఆయా ప్రాజెక్టులు, చెరువుల కింద ఆయకట్టుకు అన్ని రకాల పంటలను వేసేందుకు అనువుగా సాగునీటిని అందించనుండడంతో గతంకంటే ఈ యాసంగిలో పంటల సాగు రెట్టింపు కానుంది. మరోవైపు ప్రాజెక్టులు, ప్రధాన చెరువుల కింద ఉన్న కాలువల మరమ్మతులను ఇప్పటికే పూర్తి చేశారు. జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో చాలా చోట్ల చెరువులకు గండ్లు పడడం, కాలువలు దెబ్బ తినడం జరిగింది. వీటి మరమ్మత్తుల కోసం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. కోటీ 47లక్షల నిధులను మంజూరు చేసింది. మొత్తం 197 చోట్ల దెబ్బతిన్నట్లు గుర్తించిన అధికారులు 61 పనులను అత్యవసరంగా చేపట్టి వానకాలం పంటలకు సాగునీరందేలా చేశారు. అలాగే సారంగాపూర్ మండలంలో రూ.9 కోట్లు వెచ్చించి ధోనిగాం ప్రాజెక్టు కాలువల పనులను దాదాపుగా పూర్తి చేశారు. దీంతో ఈ ప్రాజెక్టుకింద అదనంగా మరో 2 వేల ఎకరాలకు సాగునీరందనుంది. దీంతో ఈ యాసంగి పంటలకు ఢోకా లేకుండా పోయింది.



## పూర్తి ఆయకట్టుకు సాగునీరందిస్తాం..

*జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రాజెక్టులు, చెరువుల్లో పుష్కలంగా నీరుంది. ఆయా ప్రాజెక్టులు, చెరువుల కింద గల కాలువలకు అవసరమైన చోట మరమ్మతులు కూడా పూర్తి చేశాం. సదర్మాట్ ఆనకట్ట వద్ద అక్విడక్టుకు మరమ్మతులు కూడా పూర్తయ్యాయి. అక్కడక్కడ కాలువల మరమ్మతులు కొనసాగుతున్నాయి. త్వరలోనే వాటిని కూడా పూర్తి చేసి, జిల్లా వ్యాప్తంగా ఉన్న 1,73,650 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందేలా చర్యలు తీసుకుంటాం.*

-సుశీల్‌కుమార్, ఎస్ఈ, నీటిపారుదల శాఖ, నిర్మల్

## 73,650 ఎకరాలకు సాగునీరు...

ఈ యాసంగిలో రికార్డు స్థాయిలో సాగునీరందించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. జిల్లాలోని కడెం నారాయణరెడ్డి, స్వర్ణ, గడ్డెన్నవాగు, సదర్మాట్ ప్రాజెక్టులతో పాటు ఎస్సారెస్పీ సరస్వతీ కాలువ ద్వారా జిల్లా రైతాంగానికి సాగు నీరందనున్నది. వీటితో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న 734 చెరువుల కింద గల ఆయకట్టుకు పూర్తి స్థాయిలో సాగునీరందనున్నది. ఆయా ప్రాజెక్టులు, చెరువుల కింద గల 1,73,650 ఎకరాల ఆయకట్టుకు అన్ని పంటలకూ సరిపడా సాగునీరందించాలని అధికారులు భావిస్తున్నారు. అత్యధికంగా కడెం ప్రాజెక్టు కింద 65వేల ఆయకట్టుకు నీరందనున్నది. అలాగే గడ్డెన్న వాగు ప్రాజెక్టు కింద 12 వేలు, స్వర్ణ ప్రాజెక్టు కింద 8,945 ఎకరాలు, సదర్మాట్ కింద 13,120 ఎకరాలు, ఎస్సారెస్పీ పరిధిలోని సరస్వతీ కాలువ కింద 35,375 ఎకరాలు సాగుకు నోచుకోనున్నాయి. వీటితో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న 734 చెరువుల కింద 71, 832 ఎకరాల ఆయకట్టుకు యాసంగిలో సాగు నీరందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.





పూర్తి నీటిమట్టంతో నిండు కుండను తలపిస్తున్న స్వర్ణ, గడ్డెన్న వాగు ప్రాజెక్టులు



సదర్మాట్ ప్రాజెక్టు

# ఆశ్రమాల్లో చన్నీటి స్నానం

**గిరిజన పాఠశాలల్లో పనిచేయని సోలార్ హీటర్లు**

- ఒక్కోచోట రూ. 3 లక్షలతో ఏర్పాటు
- చేతి పంపులు, నీటి ట్యాంకుల వద్ద విద్యార్థుల అవస్థలు
- తీవ్రమైన చలితో అనారోగ్యం
- సమస్య పరిష్కరించాలని వేడుకోలు



హట్టి ఆశ్రమ పాఠశాలలో పని చేయని వాటర్ హీటర్

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/కెరమెరి, డిసెంబర్ 15 : ఉట్నూర్‌లో ఐటీడీఏ పరిధిలో 104 గిరిజన ఆశ్రమ పాఠశాలలు, కస్తూర్బా విద్యాలయాలు ఉన్నాయి. ఆయాచోట్ల ఇంటిగ్రేటెడ్ యాక్షన్ ప్లాన్ (ఐఏపీ) నిధులతో సోలార్ వాటర్ హీటర్లను ఏర్పాటు చేశారు. ఎలాంటి టెండర్లు లేకుండానే ఓ సంస్థకు ఆశ్రమాల్లో సోలార్ హీటర్లు ఏర్పాటు చేసే బాధ్యత అప్పగించారు. ఒక్కోచోట రూ. 3 లక్షలతో సోలార్ హీటర్ ఏర్పాటు చేశారు. అయితే నాసిరకమైన హీటర్లను ఏర్పాటు చేయడం వల్ల అవి ఒక్క రోజు కూడా పనిచేయలేదన్న ఆరోపణలున్నాయి. సోలార్ వాటర్ హీటర్ల నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. ఇంజినీరింగ్ అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో ఫలితం లేకుండా పోయింది. దీంతో ఆయా చోట్ల చదువుతున్న విద్యార్థులు చేతి పంపుల వద్ద, నీటి ట్యాంకుల వద్ద చల్లని నీళ్లతో స్నానాలు చేస్తూ అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇకనైనా సోలార్ హీటర్లను బాగు చేయించాలని తమ ఇబ్బందులు దూరం చేయాలని వారు కోరుతున్నారు.



చేతి పంపు కింద స్నానాలు చేస్తున్న విద్యార్థులు



## మస్తు తిప్పలైతంది

*మా స్కూల్‌లో వాటర్ హీటర్ పనిచేస్తలేదు. పొద్దుగాల లేచి చల్లని నీటితో స్నానం చేయాల్సి వస్తుంది. ఎండవచ్చినంక చేద్దామంటే అప్పటికే బడి టైమ్ అయిపోతంది. చలిలో తప్పని పరిస్థితుల్లో స్నానాలు చేయాల్సి వస్తోంది. మస్తు తిప్పలైతంది. సార్లు మా బాధను అర్థం చేసుకొని హీటర్‌ను మంచిగ చేయించాలి.*

- కోట్రంగే అంకిత, 6వ తరగతి, కేజీబీవీ మోడి.



## హీటర్ ఉండి లాభం లేదు

*మా స్కూల్‌లో వాటర్ హీటర్ ఉండి లాభంలేకుంటైంది. ఇది వరకు మంచిగనే పని చేసింది. ఇప్పుడు పాడైంది. ఎండకాలం అంటే వెళ్లదీసినం. వానకాలం, చలికాలంల మస్తు తిప్పలైతంది. అంత పొద్దున లేచి స్నానం చేయాల్నంటే భయమైతంది. ఈ వారం నుంచైతే మరీ దారుణంగా చలి పెరిగింది. సార్లు మా గోస చూడాలే..*

- కాత్లే పాండు, 7వ తరగతి, హట్టి ఆశ్రమ పాఠశాల



ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లో నిరసన తెలుపుతున్న వైద్య విద్యార్థులు

# వెనక్కి తగ్గని మెడికోలు

**రిమ్స్‌లో కొనసాగుతున్న ఆందోళన**

- రెండో రోజూ విధులు, తరగతుల బహిష్కరణ
- డైరెక్టర్‌పై చర్యలకు డిమాండ్
- విచారణ జరిపిన కమిటీ సభ్యులు
- నివేదిక ప్రభుత్వానికి అందజేస్తామని ప్రకటన

ఆదిలాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్‌లో రిమ్స్‌లో జూనియర్ డాక్టర్లు, వైద్య విద్యార్థుల ఆందోళన రెండో రోజూ శుక్రవారం కొనసాగింది. హాస్టల్‌లో మెడికోలపై దుండగుల దాడిని నిరసిస్తూ గురువారం ఆందోళన బాట పట్టిన విద్యార్థులు రిమ్స్ డైరెక్టర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రెండో రోజూ జూనియర్ డాక్టర్లు విధులు బహిష్కరించగా, విద్యార్థులు కూడా తరగతులకు హాజరుకాకుండా ఆందోళనలో పాల్గొన్నారు. కళాశాల ఎదుట బైఠాయించి డైరెక్టర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రిమ్స్‌లో విద్యార్థులకు సరైన భద్రత లేకపోవడంతో తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని జూనియర్ డాక్టర్లు వాపోతున్నారు. విద్యార్థులపై దాడి ఘటనలో రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ క్రాంతి కుమార్‌ను విధుల నుంచి తొలగించగా వసీం, శివ, ఇతరులపై పోలీసులు కేసు నమోదు చేశారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ శ్యామలాదేవి రిమ్స్‌కు చేరుకొని దాడి ఘటనపై విచారణ జరిపారు. రిమ్స్ ఘటనకు సంబంధించి వైద్యవిద్యా డైరెక్టర్ కే.రమేశ్ రెడ్డి ఇద్దరు సభ్యుల కమిటీని నియమించారు. నిజామాబాద్ ప్రభుత్వం మెడికల్ కళాశాలలో సైక్రియాట్రిక్ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ శివప్రసాద్, పల్మనాలజీ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ వీవీ రావు ఈ కమిటీలో ఉన్నారు.

## కమిటీ సభ్యుల విచారణ

విద్యార్థులపై దాడికి సంబంధించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇద్దరు సభ్యుల కమిటీ శుక్రవారం రిమ్స్‌కు చేరుకొని విచారణ చేపట్టింది. డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ వీవీ రావు రిమ్స్‌కు చేరుకొని డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, ఇతర ప్రొఫెసర్లతో మాట్లాడి ఘటన వివరాలను తెలుసుకున్నారు. జూనియర్ డాక్టర్లతో కూడా మాట్లాడారు. అనంతరం సెక్యూరిటీ సిబ్బంది వద్ద వివరాలు తెలుసుకున్నారు. విచారణ కమిటీ సభ్యులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వీరితో విడివిడిగా మాట్లాడారు. మధ్యాహ్నం తర్వాత కమిటీ సభ్యులు తమ విచారణ పూర్తయిందని ఘటనకు సంబంధించిన నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు.



వివరాలను వెల్లడిస్తున్న కమిటీ సభ్యుడు

## విచారణ సక్రమంగా జరగలేదు..

అయితే దాడి ఘటనకు సంబంధించి విచారణ సక్రమంగా జరగడం లేదని జూనియర్ డాక్టర్లు ఆరోపించారు. పూర్తిగా డైరెక్టర్‌కు అనుకూలంగా ఉన్న వారితోనే విచారణ చేయించుకుంటున్నారని మండిపడ్డారు. నివేదిక కూడా వారికి అనుకూలంగా వచ్చే అవకాశమున్నదని చెప్పుకొచ్చారు.

## డైరెక్టర్‌ను తొలగించాకే విచారణ చేపట్టండి : వైద్య విద్యార్థులు

ఎదులాపురం,డిసెంబర్ 15: రిమ్స్ మెడికల్ క్యాంపస్‌లో జరిగిన ఘటనలో ముందుగా డైరెక్టర్‌ను విధుల నుంచి తొలగించాకే విచారణ చేపట్టాలని వైద్యవిద్యార్థులు డిమాండ్ చేశారు. తరగతులు బహిష్కరించిన వైద్య విద్యార్థులు రిమ్స్ మెడికల్ కళాశాల ఎదుట ధర్నా, నిరసన చేపట్టారు. సాయంత్రం రిమ్స్ ప్రధాన గేటు ఎదుట డైరెక్టర్ దిష్టి బొమ్మ దహనం చేశారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వైద్యవిద్యార్థులు